

పేదల పాలిటి పెన్నిధి ముఖ్యమంత్రి సహాయానిది - కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారి సహకారంతో సీఎం చెక్కు అందజేత

వెల్దండ(ప్రజా జ్యోతి) నవంబర్ 19 :

వెల్దండ మండలంపెద్దాపూర్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మమ్మ భర్త వేముల లక్ష్మయ్యగౌడ్ కు సి ఎం ఆర్ ఎఫ్ క్రింద మంజూరైన 40వేల రూపాయల చెక్కును గురువారం పెద్దాపూర్ గ్రామము లో బాధితురాలికి అందజేయడం జరిగింది.

మిగతా 2 లో



శుక్రవారం 20 నవంబర్ 2026 పేజీలు:11

పుస్తక పఠనమే విజయానికి బాటలు..

విద్యార్థులు చదవడం అలవాటు చేసుకోవాలి!

- ప్రతి మూడు నెలలకు మూడు పుస్తకాలు చదవాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపు

- రోజూ 10 నుంచి 20 పేజీలు చదివితే విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం

- జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో కలెక్టర్ సందేశం

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):

పుస్తక పఠనం మనిషికి విజ్ఞానాన్ని అందించడమే కాకుండా ఆలోచనా శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా కథలు, నవలలు, జీవిత చరిత్రలు, విజ్ఞాన సంబంధిత పుస్తకాలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు.

మిగతా 2 లో



ఎస్పీ ఆకస్మిక తనిఖీ బాధితుల ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

కల్వకుర్తి, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

వార్షిక తనిఖీలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ (ఐపీఎస్) బుధవారం కల్వకుర్తి సబ్ డివిజన్ కార్యాలయాన్ని, ఉర్కొండ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. స్టేషన్ కు వచ్చే బాధితులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని, వారు ఇచ్చే ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి, పారదర్శక విచారణ ద్వారా సత్వర న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు.డయల్-112 ద్వారా వచ్చే కాల్స్ పై త్వరితగతిన స్పందిస్తూ, బాధితులకు సకాలంలో సహాయం అందించాలని బ్లూ కోల్ట్ సిబ్బందికి సూచించారు.

మిగతా 2 లో





నవంబర్ 20వ తేదీన నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 25 వార్డుల్లో ఇందిరమ్మ బీమా నమోదు శిబిరాలు

- దశలవారీగా ఇందిరమ్మ బీమా నమోదు ప్రక్రియ

- మొదటి విడతలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 25 వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు

- వార్డుల వారీగా శిబిరాల ఏర్పాటు -- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

అలంపూర్ నవంబర్ 19(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జిల్లాలో ఇందిరమ్మ బీమా పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నమోదు ప్రక్రియను దశలవారీగా చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. అదేవిధంగామొదటి విడతలో భాగంగా వడ్డేపల్లి, అలంపూర్,అయిజ, గద్వాల మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 25 వార్డులను ఎంపిక చేసి ప్రత్యేక శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

మిగతా 2 లో



పుస్తక పఠనమే విజయానికి బాటలు.. విద్యార్థులు చదవడం అలవాటు చేసుకోవాలి!

మొదటిపేజీ తరువాయి

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డితో కలిసి సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ఇతివృత్తం 'ఫైండ్ యువర్ జాయ్' అని, పుస్తక పఠనం ద్వారా ఆనందంతో పాటు జీవితానికి అవసరమైన స్ఫూర్తిని పొందాలని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ కనీసం 10 నుంచి 20 పేజీలైనా అదనపు పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు.ఒక మంచి పుస్తకాన్ని రచించడానికి రచయితలు ఎన్నో సంవత్సరాల అనుభవం, పరిశీలన, విజ్ఞానాన్ని వెచ్చిస్తారని, అలాంటి జ్ఞానాన్ని పుస్తకం ద్వారా తక్కువ సమయంలోనే పొందవచ్చని వివరించారు. తాను ఎనిమిదో తరగతి చదువుతున్న సమయంలో శివ్ ఖేరా రచించిన 'యు కెన్ విన్' పుస్తకం చదివానని, అందులోని ఆలోచనలు తనపై ఎంతో ప్రభావం చూపాయని తన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం, ఇతరులకు సహాయపడే గుణం వంటి విలువలను పుస్తకాల ద్వారా నేర్చుకోవచ్చన్నారు.పుస్తక పఠనం వల్ల భాషా పరిజ్ఞానం, పదజాలం,



భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగుపడతాయని, ముఖ్యంగా ఆంగ్లంలో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి మూడు నెలల్లో కనీసం మూడు పుస్తకాలు చదవాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల సహకారంతో ప్రతి ఆదివారం జిల్లా గ్రంథాలయానికి వచ్చి కనీసం రెండు గంటలపాటు పుస్తకాలు చదవాలని సూచించారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్న కలెక్టర్, పాఠశాలల్లోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఉపాధ్యాయులు కూడా పుస్తకాలు



చదువుతూ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అలాగే నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు ఆమె జీవిత చరిత్రను చదవాలని, దేశ తొలి మహిళా ప్రధానిగా ఆమె అందించిన సేవలు, నాయకత్వ లక్షణాలు, దేశాభివృద్ధి పట్ల ఆమె ఆలోచనలను తెలుసుకోవాలని సూచించారు.జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్యదర్శి, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 20వ తేదీన నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 25 వార్డుల్లో ఇందిరమ్మ బీమా నమోదు శిబిరాలు

మొదటిపేజీ తరువాయి

అలాగే మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డుకు ప్రత్యేకంగా శిబిర నిర్వహణ ప్రదేశాన్ని నిర్ణయించి, వార్డు వారీగా నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించి, అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని సూచించారు. అలాగే మున్సిపాలిటీల వారీగా వార్డులు, శిబిరాల నిర్వహణ ప్రదేశాల వివరాలు:వడ్డేపల్లి మున్సిపాలిటీ: 1, 2వ వార్డులకు పైపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో, 5, 6వ వార్డులకు వడ్డేపల్లి మున్సిపల్ కార్యాలయంలో శిబిరాలు నిర్వహించనున్నారు.అలంపూర్ మున్సిపాలిటీ: 4వ వార్డుకు కట్టెలపేటలోని రచ్చకట్ట వద్ద, 8వ వార్డుకు న్యూ ప్లాట్స్‌లోని మున్సిపల్ కార్యాలయంలో, 9వ వార్డుకు ఇమాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శిబిరాలు నిర్వహించనున్నారు. అలాగే అయిజ మున్సిపాలిటీ: 1వ వార్డుకు లక్ష్మవ్వ గుడి వద్ద, 2వ వార్డుకు కోట్ల వీధిలోని భీమరాయుని ఆలయం వద్ద,11వ వార్డుకు కంఠంపేటలో, 12వ వార్డుకు పాత పోలీస్ స్టేషన్ సమీపంలో, 13వ వార్డుకు మద్దిలేటి స్వామి ఆలయం వద్ద, 19వ వార్డుకు మున్సిపల్ కార్యాలయంలో శిబిరాలు నిర్వహించనున్నారు. అలాగే గద్వాల మున్సిపాలిటీ: 1వ వార్డుకు యెంకంపేట వార్డు కార్యాలయంలో, 2, 3, 6వ వార్డులకు మహిళా సమాఖ్య భవనంలో, 4, 5వ వార్డులకు జమ్మిచేడు వార్డు కార్యాలయంలో, 7, 8వ వార్డులకు దౌదర్‌పల్లి వార్డు కార్యాలయంలో, 9, 24వ వార్డులకు దివ్యాంగుల పాఠశాలలో, 10, 11వ వార్డులకు మొమిన్‌మహల్లా వాటర్ ట్యాంక్ వద్ద శిబిరాలు నిర్వహించనున్నారు. అదేవిధంగాఇందిరమ్మ బీమా నమోదు కార్యక్రమాన్ని నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి వార్డులో కేటాయించిన శిబిరాల వద్ద సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులు తమ వార్డుకు కేటాయించిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ బాధితుల ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

మొదటిపేజీ తరువాయి



స్థానిక రౌడీషీటర్ల వివరాలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, వారి కదలికలపై నిరంతర నిఘా, పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో విధులు నిర్వర్తించే విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమ పరిధిలోని గ్రామాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.పోలీస్ స్టేషన్ లోని రిసెప్షన్, సైబర్ క్రైమ్ వారియర్, సీసీటీవీ ఇంచార్జ్ తదితర సిబ్బంది పనితీరును సమీక్షించి, వారి విధులకు సంబంధించిన పలు సూచనలు చేశారు. స్టేషన్ లో పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటూ, ఎలాంటి కేసులు పెండింగ్ లో ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీలో పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది కనబరిచిన క్రమశిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు వ్యవస్థ మరింత బలోపేతంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డీఎస్పీ సాయి వెంకట్ రెడ్డి, కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్, ఉర్కొండ ఎస్సై రమాదేవితో పాటు కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పేదల పాలిటి పెన్నిధి ముఖ్యమంత్రి సహాయానిది – కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారి సహకారంతో సీఎం చెక్కు అందజేత

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, వార్డు సభ్యులు తిరుపతి నాయక్, కేశమల్ల మమత అనిల్, మాడుగుల వెంకటయ్య, గంగాపురం శ్రీశైలం, ధన్ మంత్రి, జంగయ్య గౌడ్, ఎస్ సుధాకర్, ఎం వెంకటేష్, పసుపుల రాఘవేందర్, కృష్ణమాచారి, ప్రవీణ్ నాయక్, సంతు నాయక్, కే శ్రీను, ఎం లింగయ్య, కె ప్రశాంత్, శ్రీశైలం, కొండల్, శేఖర్ తదితరులు వున్నారు.

మూడవ బ్యాచ్ ఆపద మిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం









ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ 19:

జోగులాంబ గద్వాల జిల్లా,ఎర్రవల్లి మండలం కేంద్రంలో 10వ బెటాలియన్ లో కమాండెంట్ టీ.అలెక్స్ ఆధ్వర్యంలో మూడవ బ్యాచ్ ఏడు రోజుల ఆపద మిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ఈరోజు ఘనంగా ప్రారంభమైంది.ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మంది వాలంటీర్లు పాల్గొంటున్నారు.ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, వరదలు,భూకంపాలు తదితర అనుకోని విపత్తులు సంభవించినప్పుడు, అత్యవసర సేవల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపు తక్షణమే స్పందించి బాధితులకు ప్రాథమిక సహాయం అందించడం, విలువైన ప్రాణాలను కాపాడటం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ ఏడు రోజుల శిక్షణలో ప్రథమ చికిత్స అగ్నిప్రమాదాల నివారణ మరియు నియంత్రణ,వరదల సమయంలో రక్షణ చర్యలు,శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడం,అత్యవసర తరలింపు చర్యలు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సహాయక చర్యల నిర్వహణ వంటి వివిధ అంశాలపై వాలంటీర్లకు సిద్ధాంతపరమైన మరియు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నారు.ఈ సందర్భంగా కమాండెంట్ టీ.అలెక్స్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ,ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఒక మంచి అవకాశంగా భావించి,ప్రతి అంశాన్ని శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు.శిక్షణలో పొందిన జ్ఞానాన్ని కేవలం సర్టిఫికెట్‌కే పరిమితం చేయకుండా, భవిష్యత్తులో ఏదైనా విపత్తు లేదా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందించి,ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.ఆదినారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ రమణ,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు,రాజేశం, నరసింహ రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉదండాపురంలో నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ చేసిన సర్పంచ్ మహేష్

ఇటిక్యాల (ప్రజాజ్యోతి) నవంబర్ 19:

జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం నూతనంగా మంజూరైన పింఛన్ల పత్రాలను గ్రామ సర్పంచ్ గొల్ల మహేష్ అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యుగంధర్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్,జీపీఓ ఈశరయ్య,4వ వార్డు సభ్యురాలు రుక్మిణమ్మ తదితరులు పాల్గొన్నారు.





పేదల సంక్షేమమే ఇందిరమ్మ పాలన లక్ష్యం.!

- పేదరిక నిర్మూలనకు విశేష కృషి చేసిన మహానేత ఇందిరాగాంధీ

: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

- మహబూబ్‌నగర్‌లో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):



దేశంలో పేదరిక నిర్మూలన, పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. దేశాభివృద్ధికి, సామాజిక సమానత్వానికి ఆమె తీసుకొచ్చిన సంస్కరణలు చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని కొనియాడారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ దేశాభివృద్ధి కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా బ్యాంకుల జాతీయీకరణ ద్వారా బ్యాంకింగ్ సేవలను సామాన్య ప్రజలకు చేరువ చేశారని, పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన గొప్ప నాయకురాలని ప్రశంసించారు.దేశంలో పేదరిక నిర్మూలనకు ఆమె చేసిన కృషి, ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన కార్యక్రమాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రకుమార్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ ఉపాధ్యక్షుడు బెక్కరి మధుసూదన్ రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సాయిబాబా, అజ్మత్ అలీ, అవేజ్ అహ్మద్, నవనీత, చంద్రశేఖర్, గంజి ఆంజనేయులు, మహేందర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో ‘సురక్షిత్’గా పాలమూరు.!

- రాష్ట్రంలోని 20 జిల్లాల్లో మహబూబ్‌నగర్‌కు ప్రత్యేక గుర్తింపు

- 95--95--95 లక్ష్యాల సాధన దిశగా జిల్లా ప్రగతి..

కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు సత్కారం





మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):

హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల అమలులో మహబూబ్‌నగర్ జిల్లా మరో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. నిర్దేశిత 95--95--95 లక్ష్యాల సాధన దిశగా కనబరిచిన పురోగతికి గుర్తింపుగా రాష్ట్రంలోని 20 ‘సురక్షిత్ జిల్లాల’ జాబితాలో మహబూబ్‌నగర్‌కు చోటు దక్కింది. ఈ ఘనత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజీసాక్స్) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘సమ్మాన్ సమారోహ్’ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌లను టీజీసాక్స్ డిప్యూటీ డైరెక్టర్ (బీఎస్‌డీ) మేఖల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు లభించిన ఈ గుర్తింపు వెనుక పనిచేసిన ప్రతి ఒక్కరి కృషి అభినందనీయమన్నారు. సాధించిన ప్రగతితో సంతృప్తి చెందకుండా మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెచ్ఐవీపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, పరీక్షల సంఖ్య పెంచడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించడం, మధ్యలో చికిత్స నిలిపివేసిన వారిని తిరిగి వైద్య సేవల పరిధిలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. హెచ్ఐవీ నియంత్రణలో కీలకమైన 95--95--95 లక్ష్యాల ప్రకారం హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ వ్యాధి స్థితిపై అవగాహన కల్పించి నిర్ధారణ చేయడం, నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) అందించడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరల్ లోడ్‌ను అణచివేత స్థాయికి తీసుకురావడం ప్రధాన ఉద్దేశమని అధికారులు వివరించారు. అలాగే ఏఆర్‌టీ మందులు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడాలని, చికిత్స కొనసాగింపు, వైరల్ లోడ్ పరీక్షలు, తదుపరి వైద్య సేవలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం (డీఏపీసీయూ) ఆధ్వర్యంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. వైద్యులు, కౌన్సిలర్లు, స్టాఫ్ నర్సులు, ఏఆర్‌టీ, ఐసీటీసీ కేంద్రాల సిబ్బంది, వివిధ వైద్య సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే జిల్లాకు ఈ గుర్తింపు సాధ్యమైందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శశికాంత్, ఎయిడ్స్, లెప్రసీ కార్యక్రమ అధికారి డాక్టర్ రాజు నాయక్, డీఏపీసీయూ బృందం సభ్యులు, వివిధ వైద్య సేవా కేంద్రాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పాటించాలి.. కూలీలకు సకాలంలో వేతనాలు అందించాలి!

- వస్పుల గ్రామంలో పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్

- పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశం

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):

ఉపాధి హామీ పథకం పనులను నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు సకాలంలో అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం మిడ్జిల్ మండలం వస్పుల గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీఓ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా వస్పుల చెరువు పూడికతీత పనుల పురోగతిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న పని దినాలు, రోజువారీ వేతనాలు, వేతనాల చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రతి పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.



రూ.5 లక్షలతో బండ్ల బాట నిర్మాణ పనులకు శ్రీకారం

- మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో

గ్రామంలో అభివృద్ధి పనులు : నాగర్ల రఘునాథ్ రెడ్డి

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.



మండల పరిధిలోని పుల్గర్ చర్ల గ్రామ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే బండ్ల బాట నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు గ్రామ పరిధిలోని వీపనగండ్లకు వెళ్లే పీడబ్ల్యూడీ రహదారి నుంచి బండ్ల బాట నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు కాగా, నాగర్ల రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగర్ల రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామంలోని రైతులకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు బండ్ల బాట నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రైతులు తమ పంటలను పొలాల నుంచి గ్రామానికి, మార్కెట్లకు తరలించేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామానికి ఇప్పటికే మంజూరు చేయించిన ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవన నిర్మాణ పనులు, విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. మరికొద్ది రోజుల్లోనే మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఈ రెండు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బత్తుల గోపాల్, మాజీ ఉపసర్పంచ్ బిజ్జ నరేష్ కుమార్, బుసిరెడ్డి కోటిరెడ్డి, మదుగం కోదండం కలమూరి, తిరుమలయ్య, మాదుగం సుభాష్, మావిళ్ల నీలకంఠం, ఎ.రాఘవేంద్రం, ఎ. బాలరాజు, దండు బాలస్వామి, వనమోని శివయ్య, బీసిరెడ్డి మురళీధర్ రెడ్డి, మాదుగం వెంకటేష్, పోతుల ఆంజనేయులు, బత్తుల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్వలో కొత్త పింఛన్ ధృపత్రాలను పంపిణీ

నరువ నవంబర్ 18 ప్రజా జ్యోతి





నారాయణపేట జిల్లా నర్వ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల కు మంజూరైన కొత్త పింఛన్ ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని రాంపూర్ పెద్దకడుమూరు ఎల్లంపల్లి తదితర గ్రామాల ప్రజలకు ఈరోజు ఎంపీడీవో శ్రీనివాస్ చేతులు మీదుగా పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు ఈ యొక్క పెన్షన్లు వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు అందజేశారు వీరితో పాటు నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలీస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరణప్ప మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగన్న గారి వివేకవర్ధన్ రెడ్డి పెద్దకడుమూరు గ్రామ సర్పంచ్ సత్తన్న శ్రీపురం గ్రామ సర్పంచ్ ఎల్ శేఖర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్ కురుమారెడ్డి నర్వ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి శ్రీపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామన్ గౌడ్ ఎల్లంపల్లి గ్రామ అధ్యక్షులు కుర్మారెడ్డి, బీసం రవి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు సమిష్టిగా అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తుందని ప్రజలకు నేరుగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా 5 లక్షల ఇందిరమ్మ పక్క గృహాలు, రేషన్ కార్డులు పంపిణీ చేసి సన్నబియ్యం అందించడం 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు అందించడం ఫ్రీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం అలాగే గత పదిహేనులుగా ఎలాంటి ఒక్క రూపాయి ఇవ్వని మహిళా సంఘాలకు నేడు వడ్డీలేని 10 లక్షల రూపాయల రుణాలు అందించడం వాటికి వడ్డీని తిరిగి చెల్లించడం వీటితోపాటు గ్రామ అభివృద్ధికి పెద్ద కడుమూరు నుండి కొత్తపల్లి వరకు బిటి రోడ్డు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం నాగిరెడ్డిపల్లి గ్రామం నుండి నంద్యాల వరకు కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు పనులు చేయడం పనులు ప్రారంభించారు ఇవన్నీ కూడా ప్రజలకు సమిష్టిగా ఉపయోగపడే అభివృద్ధి పనులు నర్వ మండలంలోని ప్రజలందరూ గౌరవ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి గారి పట్టుదల కృషి తోటి ఎమ్మెల్యే ఎలక్షన్లో హామీ ఇచ్చిన విధంగానే వాటిని నెరవేరుస్తూ ఉన్నారు . కావున ప్రజలు సంక్షేమ అభివృద్ధి పొలాలు మీకు ఏ విధంగా ఫ్రీగా అందుతున్నాయో అదేవిధంగా కష్టపడి ప్రజల అభివృద్ధిని కాంక్షించేటటువంటి ప్రజానాయకుడు బీదల సాధనకు అండగా నిలబడే నిజమైన ప్రజా సేవకుడు కాబట్టి ఆయనకు అండగా నిలబడాలని నాయకులు ఈ సందర్భంగా కొనియాడారు.

ఇంద్రా గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న గద్దర్ కుమార్తె వెన్నెల

ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ 19:

జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో నవంబర్ 19వ తేదీన ఇంద్ర గాంధీ జయంతి సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ అధ్యక్షుడు సర్పంచులు కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్ చేయడం జరిగింది. అనంతరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం,అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు,మాజీ మండల అధ్యక్షులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





నర్వ గ్రామపంచాయతీలో సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులను అందజేత

నర్వ నవంబర్ 18 ప్రజా జ్యోతి

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో గురువారం ఉదయం వితంతువు ఒంటరి మహిళలకు మరియు వికలాంగులకు పెన్షన్ మంజూరు పత్రాలు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీడీవో శ్రీనివాసులు, నర్వ గ్రామ సర్పంచ్ టి హనుమంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ లు గురువారం ఉదయం 10 గంటలకు నర్వ గ్రామపంచాయతీ కార్యాలయంలో నర్వ గ్రామానికి చెందిన 20 మంది వివిధ రకాల పెన్షన్ లబ్ధిదారులకు అనుమతి మంజూరు పత్రాలను గౌరవ మండల డెవలప్మెంట్ అధికారి శ్రీనివాస్ , గ్రామ సర్పంచ్ టి హనుమంత్ రెడ్డి , ఆత్మకూరు మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ బి కృష్ణారెడ్డి, సెక్రెటరీ బుచ్చారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ గ్రామ వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు శరణప్ప గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు సద్దలి ఆంజనేయ రెడ్డి పి హనుమంత్ రెడ్డి పి శేఖర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బోయపాటి నరసింహులు గడ్డం నరసింహులు ఎం కురుమూర్తి కట్ట నర్సింలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ

లబ్ధిదారులను ఉద్దేశించి నర్వ మండల ప్రజలు అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించిన శ్రీ వాకిటి శ్రీహరి గారిని ఎమ్మెల్యేగా చేసిన ఘనత మనదేనని అయితే ఎమ్మెల్యే ,అదృష్టం వరించి మంత్రి అయ్యిండని కానీ అదృష్టం ఈ నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో చేసుకున్న పుణ్యమని అందువలననే నర్వ మండలంలోని నర్వ గ్రామానికి అత్యధికంగా 58 మంది కి పెన్షన్లు మంజూరు చేసినందుకు మంత్రివర్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ యొక్క పెన్షన్లను నిజమైన లబ్ధిదారులకు మంజూరు చేసినందుకు గాను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు మరియు గౌరవ ఎంపీడీవో గారికి ఎంతగానో రుణపడి ఉంటామని కొనియాడారు.అనేక రకాల సంక్షేమ పథకాల లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి గారిని మరియు మన మండలానికి అత్యధిక నిధులు ఇచ్చి అన్ని రకాల డెవలప్మెంట్లో ముందుకు తీసుకుపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వాకిటి శ్రీహరి అన్న గారికి వెన్నంటి నిలవాల్సిన అవసరం ఉందని ముక్తకంఠంతో కోరారు.ఇదే సందర్భంగా లక్షల రూపాయల ఎల్ఓసి లతో పాటు గౌరవ మంత్రివర్యులు మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నర్వ గ్రామానికి చెందిన వాకిటి రమ్య తండ్రి వాకిటి లక్ష్మన్న గారికి ఒక్క లక్ష ఇరవై వేల రూపాయలు మరియు గొల్ల అరుణ భర్త అయ్యప్ప , లకు ఈ యొక్క చెక్కులను అందజేయడం జరిగింది.



ఊరి ఉనికి కోసం ఎరవెల్లి ప్రజల పోరుబాట.. కల్వకుర్తికి పాదయాత్ర!

- డిండి లిఫ్ట్ ప్రాజెక్టుతో ముంపు ముప్పు.. గ్రామాన్ని కాపాడుకునేందుకు ప్రజల ఆందోళన...

- ఎరవెల్లి గ్రామం, తండా ప్రజలకు అండగా నిలవాలని చీమర్ల అర్జున్ రెడ్డి పిలుపు...

కల్వకుర్తి,నవంబర్ 19,(ప్రజా జ్యోతి):



పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా డిండి లిఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణంతో తమ గ్రామం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ ఎరవెల్లి గ్రామం, ఎరవెల్లి తండా ప్రజలు తమ ఊరిని, తమ భూములను కాపాడుకునేందుకు కల్వకుర్తి వరకు పాదయాత్ర చేపడుతున్నారు.తమ గ్రామ ఉనికికే ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రజలు చేస్తున్న ఈ పోరాటానికి నియోజకవర్గ ప్రజలంతా మద్దతుగా నిలవాలని చీమర్ల అర్జున్ రెడ్డి పిలుపునిచ్చారు. మన నియోజకవర్గానికి చెందిన ప్రజలు తమ గ్రామాన్ని కాపాడుకునేందుకు రోడ్డెక్కిన వేళ వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.ఒక ఊరు ముంపునకు గురవుతుంటే మౌనంగా ఉండకూడదు.. ఒక గ్రామం కన్నీళ్లు పెడుతుంటే కళ్లుమూసుకోకూడదుఅని ఆయన అన్నారు. ఎరవెల్లి ప్రజలకు ధైర్యం కల్పిస్తూ.. 'మీరు ఒంటరివారు కాదు.. మీ వెనుక మేమంతా ఉన్నాం' అనే భరోసా ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.ఈ పాదయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఎరవెల్లి గ్రామం, తండా ప్రజలకు తమ సంఘీభావాన్ని తెలియజేయాలని కోరారు. గ్రామాన్ని, గ్రామ ప్రజల భవిష్యత్తును కాపాడుకునేందుకు సాగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

వెల్దండ (ప్రజా జ్యోతి) 19:



వెల్దండ మండల కేంద్రంలో అభివృద్ధి పనులు వేగవంత మయ్యాయి. మండల కేంద్రంలోని 1వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, సింగిల్ విండో చైర్మన్ యెన్నం భూపతి రెడ్డి లు కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాన్ని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి చేయడమే మా లక్ష్యమన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరికిషన్ నాయక్, కుందారం తండా సర్పంచ్ ఘన్య నాయక్, ఉప సర్పంచ్ బస్నమోని శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ కొయ్యల పుల్లయ్య, నాయకులు క్యాసరపు వెంకటయ్య, హమీద్, కృష్ణముదిరాజ్, ఎండి రషీద్, మల్లీశ్వరి రంగనాథం, కొండయ్య, కిష్టల్, శ్రీనివాస్, రమేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య, బొక్కల శ్రీనివాస్, వెంకటేష్, భరత్ గౌడ్, గజిని శ్రీను, ఈదులపల్లి శ్రీను, రాజు, నాగరాజు, ఫరీద్, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ వద్దు.. కోర్టు భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి!

- నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు

- మాస్టర్ ప్లాన్, పార్కింగ్, న్యాయమూర్తుల క్వార్టర్స్ పనులపై ఆరా

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):



బండమీదిపల్లిలో నిర్మాణంలో ఉన్న నూతన జిల్లా కోర్టు సముదాయ భవన పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు కాంట్రాక్టర్లకు సూచించారు. న్యాయవ్యవస్థకు ఎంతో కీలకమైన కోర్టు భవన నిర్మాణంలో ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.గురువారం సాయంత్రం బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతి, నిర్మాణ నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.కోర్టు భవనాల నిర్మాణంతో పాటు పార్కింగ్ సౌకర్యాలు, న్యాయమూర్తుల నివాస క్వార్టర్స్, కోర్టు ప్రాంగణం చుట్టూ నిర్మించాల్సిన ప్రహరీ తదితర పనులపై సమీక్షించారు. న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయాధికారులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.నూతన కోర్టు కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే న్యాయవాదులు, న్యాయమూర్తులు, కక్షిదారులకు మెరుగైన వసతులు కలుగుతాయని పేర్కొన్నారు. అందువల్ల నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేయకుండా నాణ్యతతో కూడిన పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మహేష్, కృష్ణవంశీ, మధు రాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుగాంలో అక్రమ బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి..

మాగనూరు, నవంబర్ 19(ప్రజా జ్యోతి)

మాగనూర్ మండలంలోని నేరేడుగాం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మాగనూరు పోలీసులు పట్టుకున్నారు. నవంబర్ 19సాయంత్రం 6:30 గంటల సమయంలో ఓ వ్యక్తి తన కిరాణా దుకాణంలో అధిక ధరలకు బీరు విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 650 ఎంఎల్ సామర్థ్యం కలిగిన 13 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2,350 ఉంటుందని తెలిపారు. పంచుల సమక్షంలో మద్యాన్ని సీజ్ చేసి, నిందితుడిపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు..

ప్రేమ పేరుతో మోసం.. చివరకు కటకటాలపాలు!

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడి
- నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష.. రూ.6 వేల జరిమానా
- సమర్థవంతమైన పోలీసుల దర్యాప్తుకు న్యాయస్థానంలో ఫలితం

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రేమ పేరుతో యువతిని నమ్మించి, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అంతేకాకుండా రూ.6 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. మహిళలను మోసం చేస్తూ వారి జీవితాలతో చెలగాటమాడే వారికి ఈ తీర్పు చట్టపరమైన పరిణామాలను గుర్తుచేస్తోంది.పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండ మహారాజా కాలనీకి చెందిన మల్లెపోగు యాదగిరి (26) కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ, జడ్చర్లలో ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా కూడా విధులు నిర్వహించేవాడు. ఈ క్రమంలో పరిచయమైన ఓ యువతితో సుమారు ఏడాదిన్నర పాటు సన్నిహితంగా ఉంటూ, ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మించాడు. లాంగ్ డ్రైవ్‌లు, సినిమాలకు తీసుకెళ్తూ పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే యువతి వివాహం చేసుకోవాలని నిలదీయడంతో నిందితుడు తనకు మరో యువతితో ప్రేమ సంబంధం ఉందని, ఆమెను పెళ్లి చేసుకోనని చెప్పి నిరాకరించాడు. దీంతో మోసపోయానని భావించిన బాధిత యువతి 17-02-2024న మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి అవసరమైన సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో సమర్పించారు. విచారణ అనంతరం మహబూబ్‌నగర్‌లోని నాలుగో అదనపు సెషన్స్ కమ్ మహిళా న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీ అఫ్రోజ్ అక్తర్ అలీ నిందితుడు మల్లెపోగు యాదగిరికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు

ఈ కేసులో దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన మహబూబ్‌నగర్ రూరల్ సీఐ బి.గాంధీనాయక్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.మేనూ శ్రీ, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.విజయ్ కుమార్, అసిస్టెంట్ లైజన్ రమేష్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ అశోక్ రెడ్డి సమన్వయంతో పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు. సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి, న్యాయస్థానంలో సమర్థవంతంగా కేసును నిరూపించేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు లైజన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ దరావత్ జానకి ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు, యువతుల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి కాల్వల సామర్థ్యం పెంచాలి

- పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు మరమ్మతులపై సీఎంను నిలదీయాలి
- సున్నపురాళ్ల తండా నుంచి కుడికిళ్ల వరకు మరమ్మతులు పూర్తి చేయాలి
- ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాణ త్యాగానికి సిద్ధం
- మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి

నాగర్ కర్నూల్ :: నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రధాన కాలువల సామర్థ్యం పెంచాలని మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి అన్నారు.గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు నీటిని డిండి ప్రాజెక్టుకు తరలించే కుట్రను అడ్డుకోవాలని ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినిని లదీసి పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ప్రధాన కాలువల సామర్థ్యం పెంచేలా ఒత్తిడి చేసి డిస్ట్రిబ్యూట రీ కాలువల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ హయాంలో నార్లాపూర్,ఏదుల,వట్టెం రిజర్వాయర్లు పూర్తి చేశామని మూడేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చిన్న చిన్నమరమ్మతులు కూడా చేపట్టలేదని విమర్శించారు. కాలువల సామర్థ్యం తగ్గడంతో పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు మంత్రి జూపల్లి



నిర్లక్ష్యంవల్లే సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని,మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకంలో మూడు మోటార్లు ధ్వంసమై రెండు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయని,అన్ని మోటార్లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చి రిజర్వాయర్లను నింపిరైతులకు సాగునీరు అందించాలని,ప్రాజెక్టుల పూర్తి కోసం తాను ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని నాగం జనార్దన్ రెడ్డి అన్నారు.

సివిల్ సప్లై కమిషనర్‌ను కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్

కల్వకుర్తి, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కమిషన్ సభ్యులతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో కమిషనర్ వై. నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. ఈ భేటీలో కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.



భగవద్గీత మానవాళికి దిక్సూచి

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఘన సన్మానం
- మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి

కల్వకుర్తి, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

భగవద్గీత మానవాళికి జీవన మార్గాన్ని చూపించే దిక్సూచి అని బీజేపీ మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న భగవద్గీత పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కల్వకుర్తిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా సన్మానించారు.బీజేపీ జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. భగవద్గీత యుద్ధతంత్రంతో పాటు శాంతి, సహనం, మానవ జన్మ విశిష్టత, జీవన విధానాన్ని బోధిస్తుందన్నారు. చిన్న వయసులోనే భగవద్గీత శ్లోకాలను కంఠస్థం చేసి, స్పష్టమైన ఉచ్చారణతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం కల్వకుర్తికి గర్వకారణమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, వారిని తీర్చిదిద్దుతున్న గురువులను అభినందించారు.బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరి జీవితంలో మంచి మార్పును తీసుకొస్తుందని, ఆధ్యాత్మికతను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వశీకర్, వేదసాయి, సాహుతేజ్, ప్రకృతితో పాటు భగవద్గీత గురువులు సుకన్య, కూన స్వప్న, వసుంధరలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ నరసింహ, సీనియర్ నాయకులు సూర్యకృష్ణ గౌడ్, నరెడ్ల శేఖర్ రెడ్డి, సురేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబీదేవ్, కౌన్సిలర్లు శ్రీరాములు, రామకృష్ణ, ఎస్టీ మోర్చా అధ్యక్షులు వంశీ నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి దేవర్ల మహేష్, శివరాం, రాఘవేందర్ గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.



భూ రీసర్వేలో పారదర్శకతే లక్ష్యం.. రైతులు సహకరించాలి!

– శంకరాయపల్లిలో రైతులకు అవగాహన కల్పించిన అదనపు కలెక్టర్ హరిప్రియ

– జీపీఎస్ రోవర్‌తో భూముల ఖచ్చితమైన కొలతలు.. హక్కుల పరిరక్షణకు చర్యలు

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):

భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు రైతులు, పట్టాదారులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ సూచించారు. భూముల సరిహద్దుల నిర్ధారణ, భూ రికార్డుల నవీకరణలో రీసర్వే కీలకమని పేర్కొన్నారు.గురువారం జడ్చర్ల మండలం శంకరాయపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని భూ రీసర్వే విధానం, లక్ష్యాలు, ప్రయోజనాలపై రైతులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జీపీఎస్ ఆధారిత రోవర్ పరికరాలతో భూములను ఖచ్చితంగా కొలవడంతో పాటు భూ రికార్డులను నవీకరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. భూముల సరిహద్దులపై స్పష్టత రావడం వల్ల భూ వివాదాల పరిష్కారానికి, భూయజమానుల హక్కుల పరిరక్షణకు దోహదపడుతుందని వివరించారు. రీసర్వే నిర్వహించే తేదీన రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని, తాజా భూ రికార్డులను సర్వే బృందాలకు అందించాలని కోరారు. సర్వే పూర్తయిన అనంతరం కొలతలు, భూముల విస్తీర్ణ వివరాలను సంబంధిత పట్టాదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర గ్రామాలు, పట్టణాల్లో నివసిస్తున్న పట్టాదారులకు సైతం ముందుగానే సర్వే తేదీలను తెలియజేసి, వారు తమ భూముల వద్ద హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులతో సరిపోల్చి, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణం, వర్గీకరణ వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు.



రైతుల భాగస్వామ్యం, అధికారుల సమన్వయంతో రీసర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేస్తామని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు కేరాఫ్‌గా ఎన్‌సీసీ శిక్షణ శిబిరం.!

- జేపీఎన్‌సీఈలో 600 మంది పాఠశాల విద్యార్థులకు సైనిక శిక్షణ

- శిబిరం ఏర్పాట్లను పరిశీలించిన సైనిక ఉన్నతాధికారులు

- దేశభక్తి, నాయకత్వ లక్షణాల పెంపునకు ఎన్‌సీసీ దోహదం:

కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):

విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం పెంపొందించేందుకు జాతీయ సైనిక విద్యాదళం (ఎన్‌సీసీ) శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని జయప్రకాష్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని జేపీఎన్‌సీఈ కళాశాల ప్రాంగణంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులతో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.శిక్షణ శిబిరం నిర్వహణ, ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించేందుకు గురువారం భారత సైన్యానికి చెందిన ఉన్నతాధికారులు కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్‌తో ప్రత్యేకంగా సమావేశమై శిబిరం నిర్వహణ, శిక్షణ కార్యక్రమాలు, అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించారు.ఈ సందర్శనలో హైదరాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ ప్రశాంత్ కుమార్, శిక్షణాధికారి లెఫ్టినెంట్ కల్నల్ శైలేంద్ర భారద్వాజ, కమాండింగ్ అధికారి కల్నల్ గగన్‌దీప్ అరోరా, పరిపాలనాధికారి కల్నల్ ప్రశాంత్ మిశ్రా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ కె.ఎస్. రవికుమార్ మాట్లాడుతూ, తమ కళాశాల ప్రాంగణంలో 600 మంది విద్యార్థులతో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం నిర్వహించడం గర్వకారణమన్నారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం వంటి గొప్ప విలువలను అలవర్చడంలో ఈ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.యువతలో దేశసేవ పట్ల ఆసక్తిని పెంపొందించి, భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని తెలిపారు. శిక్షణ శిబిరానికి అవసరమైన వసతులు, సహాయ సహకారాలు అందించేందుకు కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు.సైనిక ఉన్నతాధికారుల సందర్శన, వారి



మార్గదర్శకత్వం కళాశాలకు మాత్రమే కాకుండా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కూడా ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని కె.ఎస్. రవికుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

గురుకులంలో విద్యార్థులపై దాడి.

భయంతో కళాశాల విడిచి వెళ్లిన విద్యార్థులు!

– హెయిర్ కటింగ్ చేయించుకోలేదని విచక్షణారహితంగా కొట్టిన పీటీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్‌కు విద్యార్థి సంఘా నాయకులు విద్యార్థి తల్లిదండ్రులు వినతి







గద్వాల (ప్రజా జ్యోతి) నవంబర్ 19:

జోగులాంబ గద్వాల వీరాపురంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులపై పీటీ టీచర్ దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. హెయిర్ కటింగ్ చేయించుకోలేదనే కారణంతో ఐదారుగురు విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టడంతో పాటు, ఇతర విద్యార్థులను సైతం భయభ్రాంతులకు గురిచేసినట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాల్సిన ఉపాధ్యాయులే కర్రలు, చెప్పులతో బెదిరిస్తూ దాడులకు పాల్పడడం దారుణమని మరి ఇంతకముందు కూడా ఇలాగే జరిగింది అపుడు చర్యలు తీసుకోవాలేదు అని వారు మండిపడ్డారు.పీటీ టీచర్ భరత్ దాడిని చూసి భయపడిన సుమారు10 మంది విద్యార్థులు తమను కూడా కొడతారనే భయంతో కళాశాలకు సమాచారం ఇవ్వకుండా నిన్న సాయంత్రం నుంచి బయటకు వెళ్లిపోయారని తెలిపారు.కొందరు స్నేహితుల వద్దకు, మరికొందరు తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నారనితమపై జరిగిన దాడి విషయాన్ని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తామని విద్యార్థులు చెప్పగా,పీటీ టీచర్ అసభ్య పదజాలంతో దూషిస్తూ చెప్పులతో కొడతానని బెదిరించినట్లు ఆరోపించారు. విద్యార్థుల భద్రతకు బాధ్యత వహించాల్సిన గురుకుల యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు.గురుకులాలు విద్యార్థుల భవిష్యత్తును నిర్మించే విద్యాలయాలా? లేక భయంతో బతికే జైళ్లా? అని ప్రశ్నిస్తూ విద్యార్థులపై శారీరక దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్,డీసీఓ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, విద్యార్థులపై దాడికి పాల్పడిన పీటీ టీచర్ భరత్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని, ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.కళాశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థుల భద్రతను నిర్ధారించి వారిని తిరిగి తీసుకురావాలని కోరారు.ఈ మేరకు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్,డీసీఓకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షుడు హాలింపాషా,పి ఎల్ వైజిల్లా అధ్యక్షుడు దానయ్య,టీవీ వి మాజీ నాయకుడు ఎల్కూరు నాగన్న తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులపై దాడులు ఆపాలి.గురుకులాల్లో భద్రత కల్పించాలి .విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు..

జేపీ నగర్ సమీపంలో రోడ్డు ప్రమాదం.. బస్సు డీజిల్ ట్యాంక్ ధ్వంసం...

ప్రయాణికులందరూ సురక్షితం.. కారులో ఇద్దరికి గాయాలు..

కల్వకుర్తి, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

కల్వకుర్తి మండలం జేపీ నగర్ గ్రామ సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడగా, బస్సులోని ప్రయాణికులు, డ్రైవర్, కండక్టర్ సురక్షితంగా బయటపడ్డారు.వివరాల్లోకి వెళితే.. బల్మూర్ మండలం గట్టు తుమ్మెన గ్రామానికి చెందిన బత్తుల విష్ణుమూర్తి (46) అచ్చంపేట ఆర్టీసీ డిపోలో గత 13 ఏళ్లుగా డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కండక్టర్ రమావత్ లలితతో కలిసి ఏపీ 29 జెడ్ 3412 నంబరు గల బస్సును అచ్చంపేట నుంచి కల్వకుర్తికి తీసుకొచ్చారు. అనంతరం ఉదయం 11.30 గంటల సమయంలో ప్రయాణికులతో తిరిగి అచ్చంపేటకు బయలుదేరారు.ఈ క్రమంలో కల్వకుర్తిలోని సీబీఎం కళాశాల దాటిన తర్వాత జేపీ నగర్ సమీపానికి చేరుకోగానే ఎదురుగా వచ్చిన టీఎస్ 07 యూకే 5008 నంబరు గల కారు అతివేగంగా వచ్చి బస్సు కుడివైపు డీజిల్ ట్యాంక్ వద్ద బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు డీజిల్ ట్యాంక్ నుంచి వెనుక టైరు వరకు బాడీ దెబ్బతినడంతో పాటు సెంటర్ బోల్ట్ విరిగిపోయింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ చారకొండ మండలం జూపల్లి గ్రామానికి చెందిన జక్కుల శివగా గుర్తించారు. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.





పారదర్శకతను ప్రశ్నిస్తే జర్నలిస్టులపై అసహనమా?

- మున్సిపల్ కార్యాలయంలో అనధికార జోక్యంపై పాత్రికేయుల ఆగ్రహం...

పబ్లిక్ రికార్డుల కోసం వెళ్లిన విలేకరితో చైర్‌పర్సన్ భర్త దురుసు ప్రవర్తనపై నిరసన..

కల్వకుర్తి, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా భావించే పత్రికా రంగం స్వేచ్ఛకు భంగం కలిగించేలా కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఘటనపై స్థానిక పాత్రికేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో భాగంగా అధికారిక సమాచారం కోసం వెళ్లిన ‘నల్లమల’ దినపత్రిక ప్రతినిధి పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త దురుసుగా వ్యవహరించడాన్ని జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు ఖండించారు.

వీధి వ్యాపారుల జాబితాపై కథనంతో వివాదం

పట్టణంలో రోడ్డు విస్తరణ కారణంగా ఉపాధి కోల్పోతున్న వీధి వ్యాపారులకు షాపుల కేటాయింపు కోసం రూపొందించిన జాబితాలో, గతంలోనే ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు పొందిన కుటుంబాలకు మరోసారి అవకాశం కల్పించారన్న అంశంపై బుధవారం ‘నల్లమల’ దినపత్రిక ఆధారాలతో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం. రత్నమాల విలేకరికి ఫోన్ చేసి, విచారణ అనంతరం ఆ రెండు పేర్లను తొలగించి, కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రా నిర్వహించి 59 మంది అర్హులను ఎంపిక చేసినట్లు వివరించారు. తుది జాబితాను కార్యాలయంలో అందిస్తానని, లేదంటే వాట్సాప్ ద్వారా పంపిస్తానని హామీ ఇచ్చారు.

సమాచారం కోసం వెళ్తే దురుసు ప్రవర్తన?

చైర్‌పర్సన్ ఇచ్చిన హామీ మేరకు తుది జాబితాలోని వివరాలను పరిశీలించి ప్రజలకు తెలియజేసేందుకు విలేకరి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. అయితే చైర్‌పర్సన్ పక్కనే అధికారిక ఛాంబర్‌లో ఉన్న ఆమె భర్త ఆనంద్, ఎలాంటి అధికారిక హోదా లేకపోయినా పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ విలేకరితో అసహనంగా, దురుసుగా మాట్లాడినట్లు ఆరోపణలు వచ్చాయి. పబ్లిక్ డాక్యుమెంట్లను ఇవ్వడానికి నిరాకరించడంతో పాటు, జర్నలిస్టుల విధి నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. సంయమనంతో వ్యవహరించిన విలేకరి వాగ్వాదానికి దిగకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు.



పబ్లిక్ రికార్డులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

తెలంగాణ మున్సిపాలిటీ చట్టం-2019లోని నిబంధనలు, సమాచార హక్కు చట్టం-2005లోని సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితాలు, సంబంధిత అధికారిక రికార్డుల పారదర్శకతపై జర్నలిస్టులు ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారిక హోదా లేని వ్యక్తుల జోక్యం, సమాచార సేకరణకు ఆటంకాలు కలిగించడం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు ఐక్య పోరాటం

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, పాలనలోని లోపాలను ప్రశ్నించడం పత్రికల బాధ్యత అని జర్నలిస్టులు స్పష్టం చేశారు. వార్తలు రాసినందుకు విలేకరులపై అసహనం ప్రదర్శించడం సరికాదని పేర్కొన్నారు. పాత్రికేయ వృత్తి గౌరవానికి, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఘటనపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యాలయంలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరిపించాలని, వీధి వ్యాపారుల తుది జాబితాను బహిర్గతం చేయాలని కోరారు. ప్రజలకు సంబంధించిన పథకాల అమలులో పారదర్శకత పాటించాలని, జర్నలిస్టులు స్వేచ్ఛగా విధులు నిర్వహించే వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి అర్హా కుటుంబానికి ఇందిరమ్మ బీమా అందేలా విస్తృత ప్రచారం.!

- అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు

- గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో శుక్రవారం ప్రత్యేక ప్రచారం

మహబూబ్‌నగర్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో):

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అర్హులైన ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించి, పథకం ప్రయోజనాలు అందేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో వెబ్‌ఎక్స్ సమావేశం నిర్వహించిన ఆమె, పథకం ప్రాముఖ్యత, లక్ష్యాలు, అర్హులైన కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారం అర్హులకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు.శుక్రవారం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రచారం చేయడంతో పాటు పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లను ఏర్పాటు చేసి ప్రజలకు పథకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా పథకం సమాచారం తెలియక ప్రయోజనం కోల్పోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రచార కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, పథకం వివరాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నర్సింహులు, అసెంబ్లీ నియోజకవర్గాల నోడల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలనీ

- బిఎస్పీ జిల్లా అధ్యక్షులు బోనాసి రామచంర్

నాగర్ కర్నూల్ నవంబర్ 19 (ప్రజా జ్యోతి బ్యూరో)

జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించేలా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, గురువారం బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ దేవసహాయం గారికి వినతిపత్రంసమర్పించారు. ఈ సందర్భంగా బిఎస్పీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్ మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ గారి ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీబి), ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల వసతి గృహాలు, యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థులకు నాసిరకమైన భోజనం, పురుగులు ఉన్న అన్నం, నాణ్యతలేని ఆహారం అందుతున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతలేని ఆహారం కారణంగా విద్యార్థులు అనారోగ్యం, ఆహార విషబాధ వంటి సమస్యలకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేద, బలహీన వర్గాల విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుతో ముడిపడిన ఈ సమస్యపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ ప్రధానంగా ఆరు డిమాండ్లను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, విద్యాసంస్థల హాస్టళ్లలో తక్షణమే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, తాగునీరు, సరుకుల నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక జిల్లా స్థాయి తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి. నాసిరకమైన ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లు, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించాలి. ప్రతి హాస్టల్‌లో ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ఏర్పాటు చేసి, తనిఖీలు, తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించేలా చర్యలు చేపట్టాలి. ఈ సమస్యను అత్యవసర అంశంగా పరిగణించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు ప్రారంభించాలని బిఎస్పీ తరఫున డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ బాధ్యత. పేద విద్యార్థుల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటమాడే నిర్లక్ష్యాన్ని బహుజన్ సమాజ్ పార్టీ సహించదనీ స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కులు, ఆరోగ్యం కోసం బిఎస్పీ నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, పార్లమెంట్ ఇంచార్జ్ సి.కళ్యాణ్, జిల్లా ఈసీ మెంబర్ హర్ష ముదిరాజ్, అచ్చంపేట అసెంబ్లీ ఇంచార్జ్ శ్రీకాంత్, నాగర్ కర్నూల్ అసెంబ్లీ నాయకులు కాకునూరి మధు, నాగరాజ్, దేవరపాగ రాముడు, జన్ను ఆంజనేయులు, కుందేటి రాములు, ఆగపు శంకర్, నల్లగంటి బాలరాజ్, బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పేకాట రాయుళ్లపై పోలీస్ పంజా..10 మంది అరెస్ట్

- రూ.18,200 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం

చిన్నంబావి,నవంబర్ 19 (ప్రజాజ్యోతి)

వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలో గూడెం వెళ్లే దారిలో కాశిరెడ్డి వాగు సమీపంలో అక్రమ పేకాట కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చిన్నంబావి పోలీసులు కొరడా ఝళిపించారు. పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 10 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18,200 నగదు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నంబావి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో అక్రమంగా పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న 10 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద ఉన్న రూ.18,200 నగదు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల వారు ఉన్నట్లు తెలిసింది. పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై రామన్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పేకాట, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, ఎవరైనా పేకాట నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు అసాంఘిక చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



